క్లుప్తంగా

విద్యుత్ షార్ట్ సర్క్యూట్.. పరికరాలు దగ్ధం


డయాగ్నోస్టిక్‌లో దగ్ధమైన పరికరాలు

కందుకూరు: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వలన డయాగ్నోస్టిక్ సెంటర్‌లో విలువైన పరికరాలు దగ్ధమయ్యాయి. కుందుకూరులో ఎస్‌బీఐ బ్యాంక్ సమీపంలో వరికుప్పల మధు శ్రీ మహాలక్ష్మీ డయాగ్నోస్టిక్ ల్యాబ్‌ను నిర్వహిస్తున్నాడు. అయితే సోమవారం రాత్రి ల్యాబ్‌లో షార్ట్ సర్క్యూట్‌తో విలువైన వస్తువులు దగ్ధమయ్యాయి. వాటి విలువ సుమారుగా రూ.30 లక్షలు ఉంటుందని బాధితుడు తెలిపారు. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పొంగులేటికి శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నేతలు


పొంగులేటికి శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు

కందుకూరు: టీపీసీసీ ప్రచార కమిటీ కో చైర్మన్‌గా నియమితులైన మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి, కాంగ్రెస్ నాయకుడు కొత్త మనోహర్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని పొంగులేటి నివాసంలో ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. పొంగులేటికి శుభాకాంక్షలు తెలిపిన వారిలో సంతోష్ ముదిరాజ్, వెంకట్రామిరెడ్డి, పవన్, నర్సింగ్‌రావు, నర్సింగ్ యాదవ్, కార్తీక్‌రెడ్డి, భీమేశ్ తదితరులున్నారు.

బండ ప్రకాష్‌ను కలిసిన ముదిరాజ్ సంఘం నేతలు


బండ ప్రకాష్‌తో ముదిరాజ్ సంఘం నాయకులు

కందుకూరు: రాష్ట్ర శాసనమండలి డిప్యూటీ చైర్మన్‌గా బండ ప్రకాష్ ముదిరాజ్‌ను ఎన్నిక ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం మండల ముదిరాజ్ సంఘం మాజీ అధ్యక్షుడు మన్నే జయేందర్ ఆధ్వర్యంలో ముదిరాజ్ సంఘం నాయకులు కలిశారు. ముదిరాజ్‌ల అభివృద్ధికి చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో మీర్‌ఖాన్‌పేట ఎంపీటీసీ రాములు, ముదిరాజ్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీధర్ ముదిరాజ్, మండల ప్రధాన కార్యదర్శి వెంకటేష్ ముదిరాజ్, నాయకులు మల్లేష్ ముదిరాజ్, హరికృష్ణ ముదిరాజ్, ఉదయ్ ముదిరాజ్, భిక్షపతి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం


అంకిత (ఫైల్)

పహాడీషరీఫ్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువతి అదృశ్యమైన ఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రావిరాల హౌసింగ్ బోర్డుకు చెందిన కాంటేకార్ మహేష్ కుమార్తె అంకిత(23) ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. అయితే రెండు రోజులుగా యువతి కుటుంబసభ్యులతో మాట్లాడకపోవడంతో ఈ నెల 17న తల్లి మందలించింది. దీంతో అదేరోజు రాత్రి 10.30 గంటల సమయంలో ఎవరికీ చెప్పకుండా బయటికి వెళ్లింది. అప్పటి నుంచి ఆమె కనిపించకపోవడంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు


భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ భక్తులకు కొంగు బంగారంలా మారింది. ఆషాఢమాసం అమ్మవారికి ఇష్టమైన రోజు మంగళవారం కావడంతో భక్తులు ఉదయం నుంచే ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో సామూహిక శ్రీ సత్యానారాయణ వ్రతాలు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ చైర్మన్ రత్నం, పాలక మండలి సభ్యులు, పూజారులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

చినుకు పడితే చీకటే


సరస్వతిగూడ గ్రామం

- రెండు గ్రామాల వ్యథ
- గాలి, వాన వస్తే కరెంట్ బంద్
- అటవీ భూముల్లో విద్యుత్ లైన్ ఉండడమే కారణం

కందుకూరు: ఆ రెండు గ్రామాలు ఒకప్పుడు ఒకే పంచాయతీగా ఉండేవి. నూతన పంచాయతీల ఏర్పాటులో భాగంగా రెండు పంచాయతీలుగా ఆ గ్రామాలను ఏర్పాటు చేశారు. అయితే ఆ గ్రామాలను విద్యుత్ సమస్య వెంటాడుతోంది. చిన్నపాటి వర్షం కురిసినా, గాలి వచ్చినా కరెంట్ సరఫరా ఆగిపోతోంది. అటవీ భూముల్లో విద్యుత్ లైన్ ఏర్పాటు చేయడంతోనే సమస్య వస్తోందని గ్రామస్తులు అంటున్నారు. మండలంలోని అగర్‌మియాగూడ పంచాయతీ పరిధిలో సరస్వతిగూడ అనుబంధ గ్రామంగా ఉండేది. 2016లో సరస్వతిగూడను కొత్త పంచాయతీగా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆ రెండు గ్రామ పంచాయతీల్లో దాదాపుగా 400కు పైగా ఇళ్లు, 1600 జనాభా, 1100కు పైగా ఓటర్లున్నారు. ఈ రెండు గ్రామ పంచాయతీలకు లేమూరు సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా అవుతోంది. అయితే ఆ గ్రామాలకు అటవీభూముల నుంచే విద్యుత్ లైన్లు ఏర్పాటు చేసి.. సరఫరా చేస్తున్నారు. వర్షం పడినా, గాలి వీచినా అటవీ భూముల్లో ఏర్పాటు చేసిన లైన్లపై చెట్ల కొమ్మలు పడి సరఫరా నిలిచిపోతుంది. వ్యవసాయంతో పాటు ఇళ్లకు కూడా అదే లైన్ ద్వారా కరెంట్ సరఫరా అవుతోంది. అటవీ భూముల్లోకి రాత్రి వేళలో వెళ్లి పనులు చేయాలన్నా విద్యుత్ సిబ్బందికి సమస్యగా మారింది. ఏళ్లుగా ఈ సమస్య ఉంది. తమకు తక్కుగూడ నుంచి రాంకీ వరకు వస్తున్న 24 గంటల విద్యుత్ లైన్ ద్వారా తమ గ్రామాలకు స్తంభాలు ఏర్పాటు చేసి సరఫరా చేయాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ట్రిప్ అవుతోంది నిజమే

అటవీ భూముల నుంచి విద్యుత్ లైన్లు ఉండడంతో వర్షం, గాలి వచ్చినప్పుడు చెట్ల కొమ్మలు లైన్లపై పడి తరచూ లైన్ ట్రిప్ అవుతోంది. వెంటనే సిబ్బందిని పంపి రాత్రి అయినా సమస్య పరిష్కరిస్తున్నాం. ఏ రోజు కూడా నిర్లక్ష్యం వహించలేదు. తుక్కుగూడ ప్లాస్టిక్ పార్కులోని సబ్‌స్టేషన్ నుంచి రాంకీ వరకు విద్యుత్ సరఫరా అవుతుంది. అక్కడి నుంచి ఒక కిలోమీటర్ దూరంలో ఉన్న సరస్వతిగూడ వరకు స్తంభాలు వేసి సరఫరా చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– రమేష్, ఏఈ, కందుకూరు

రైతుల కష్టం కాంగ్రెస్‌కే తెలుసు


నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

మేయర్ చిగురింత పారిజాత

బడంగ్‌పేట్: రైతుల కష్టం కాంగ్రెస్ పార్టీకే తెలుసని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాత అన్నారు. ఏఐసీసీ నేత రాహుల్‌గాంధీపై ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పారిజాత మాట్లాడుతూ తెలంగాణ ఇచ్చిన వ్యక్తుల పట్ల ఆగౌరపరిచేలా మట్లాడటం సరికాదన్నారు. కేసీఆర్, మంత్రి కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు రాళ్లగూడం సంతోషి, సుధర్శన్‌రెడ్డి, బండారి మనోహర్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుభాన్‌యాదవ్, మహిళా అధ్యక్షురాలు అమృత, బాల్‌నింగని జంగయ్య, ఆనంద్ రెడ్డి, గట్టు బాలకృష్ణ, గుర్రం లక్ష్మారెడ్డి, మనోహర్, బంగారి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలోనే దేశాభివృద్ధి


కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఏనుగు జంగారెడ్డి

కందుకూరు: కాంగ్రెస్ పార్టీ పాలనలోనే దేశం అభివృద్ధి చెందిందని టీపీసీసీ ప్రచార కమిటీ కార్యనిర్వాహక సభ్యుడు ఏనుగు జంగారెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చిగురింత నర్సింహారెడ్డి తెలిపారు. పీసీసీ పిలుపుతో పార్టీ మండలాధ్యక్షుడు ఎస్. కృష్ణనాయక్ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ దేశాన్ని అన్నపూర్ణగా మార్చిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, హరిత విప్లవం ద్వారా కోట్లాది మందికి ఉపాధి కల్పించారని గుర్తుచేశారు. బ్యాంకులను జాతీయం చేసి, రైతులకు రుణాలిచ్చారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ వ్యవసాయానికి వెన్నుముకగా నిలిచిందన్నారు. కాంగ్రెస్‌పై బురద జల్లి పబ్బం గడుపుకోవాలని బీఆర్‌ఎస్ పార్టీ చూస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు మల్లేష్, యూత్ అధ్యక్షుడు నర్సింహాచారి, మైనార్టీ, ఎస్టీ, ఎస్సీ సెల్ అధ్యక్షులు సయ్యద్ అజీజ్, గణేష్‌నాయక్, నర్సింహా, యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్, వెంకటేష్‌గౌడ్, మహేశ్, శ్రీకాంత్, ప్రశాంత్, నవీన్ పాల్గొన్నారు.

నులిపురుగులను నివారిద్దాం

ఎంపీపీ నిర్మల


సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి

తలకొండపల్లి: ఈనెల 20న నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని(ఎన్‌డీడీ) విజయవంతం చేయాలని ఎంపీపీ నిర్మల పిలుపునిచ్చారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆమె.. ఏఎన్‌ఎం, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు.. కల్పన, సైదమ్మ నులిపురుగుల నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 1 నుంచి 19 సంవత్సరాల్లోపు బాలబాలికలకు నులిపురుగు వ్యాధి నివారణ మాత్రలు తప్పనిసరిగా వేయించాలన్నారు. 1 నుంచి 2 సంవత్సరంలోపు వారికి సగం మాత్ర, 2 నుంచి 3 సంవత్సరాల్లోపు వారికి ఒక మాత్ర, 3 నుంచి 19 సంత్సరాల లోపు వారికి 2 మాత్రలు వేయాలని తెలిపారు. తలకొండపల్లి, గట్టు ఇప్పలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అంగన్‌వాడీ, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల, ఇతర పిల్లలను కలిపి మొత్తం 13,500 మంది విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేయనున్నామని డాక్టర్లు తెలిపారు. నులిపురుగులతో పిల్లలు తరచుగా అనారోగ్యం పాలవుతారని చెప్పారు. చదువు పట్ల ఆసక్తి తగ్గుతుందన్నారు. నులిపురుగుల మాత్రలు వేసుకుంటే పిల్లల్లో రక్తహీనతను నివారించవచ్చన్నారు. ఆల్బెండజోల్ మాత్రలు వేసి నులిపురుగులను నిర్మూలించవచ్చన్నారు. ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీకాంత్, రామచంద్రయ్య, ఆశ, అంగన్‌వాడీ, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి

యాచారం: బీజేపీ అధిష్టానం పిలుపు మేరకు అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని బాటసింగారంలో మంగళవారం జరిగిన టిఫిన్ బైఠక్‌లో యాచారం బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్ ఆధ్వర్యంలో పలు గ్రామాల నుంచి శ్రేణులు తమ ఇళ్ల నుంచే భోజనం తీసుకెళ్లి అక్కడే భోజనం చేసి పార్టీ బలోపేతంపై చర్చించుకున్నారు. గ్రామస్థాయిలో పార్టీ బలోపేతం, కేసీఆర్ సర్కార్ వ్యతిరేక విధానాలు, హామీలపై పోరాటాలకు సిద్ధం కావాలని దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు భాషా పిలుపునిచ్చారు. అంజయ్య యాదవ్, రమేష్ ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

హుడాకాంప్లెక్స్: చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు సరూర్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ కే రామకృష్ణ ప్రకటించారు. 11కేవీ స్వాతి రెసిడెన్సీ ఫీడర్ పరిధిలోని కాలనీలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు.. 11కేవీ సాయినగర్, హరిపురికాలనీ, సౌత్‌ఎండ్ పార్కు ఫీడర్ల పరిధిలోని ప్రాంతాలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు... 11కేవీ నర్సింహపురికాలనీ, వాసవికాలనీ ఫీడర్ల పరిధిలోని కాలనీలలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని రామకృష్ణ కోరారు.

ఘనంగా పట్టాభిషేక మహోత్సవం

మీర్‌పేట: మీర్‌పేట గాయత్రినగర్‌లోని రవీంద్రభారతి పాఠశాలలో మంగళవారం ఘనంగా పట్టాభిషేక మహోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి నేవీ అధికారి నందు ముఖ్య అతిథిగా హాజరై.. మాట్లాడారు. నేటి బాలలే రేపటి ప్రజలను పాలించే నాయకులని, విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కుముదవల్లి, డీన్ ప్రమీల, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ నేతల ఇంటింటి ప్రచారం

తలకొండపల్లి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని బీజేపీ సీనియర్ నేత ఆచారి ఆ పార్టీ నాయకులకు సూచించారు. స్వర్ణశక్తికర్ణ అభియాన్‌లో భాగంగా మంగళవారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆచారి పర్యటించారు. ఇంటింటికి బీజేపీ కార్యక్రమంలో భాగంగా బీజేపీ మండల అధ్యక్షుడు రవిగౌడ్, స్థానిక నాయకులతో కలిసి కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రవిగౌడ్, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సర్పంచ్ కుమార్, బీజేవైఎం నియోజకవర్గ కన్వీనర్, ఉప సర్పంచ్ అనిల్, రాష్ట్ర అదనపు కార్యదర్శి పాండు, జిల్లా ప్రధాన కార్యదర్శి పాండుప్రసాద్, శ్రీకాంత్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీశైలం, శివ, హరికాంత్ పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థికసాయం

కడ్తాల్: నిరుపేద విద్యార్థులు ఉన్నత చదువులు చదివేందుకు ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చేయూతనందిస్తుందని ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ అన్నారు. మాడ్గుల మండల పరిధిలోని అప్పారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ముత్యాలుది నిరుపేద కుటుంబం కావడంతో తన కూతురు సరితను ఇంటర్ చదివించేందుకు ఇబ్బందులు పడుతున్నాడు. స్థానిక నాయకుడు శేఖర్‌తో కలిసి ఇటీవల ఉప్పల వెంకటేశ్‌ను కలిసి సమస్యను వివరించారు. స్పందించిన వెంకటేశ్ విద్యార్థిని సరిత ఉన్నత చదువుల కోసం ట్రస్ట్ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యుడు డాక్టర్ అఖిల్ మంగళవారం సరితకు రూ.15 వేల చెక్కును అందజేశారు. నాయకులు శేఖర్, విజేందర్ పవార్, భాస్కర్‌గౌడ్ ఉన్నారు.

శ్రీవారి సన్నిధిలో ఎమ్మెల్యే

కడ్తాల్: కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మంగళవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయంలో శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజల అనంతరం మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఆలయ అధికారులు, వేదపండితులు, పట్టు వస్త్రాలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురువాలని, పాడిపంటలతో ప్రజలంతా సంతోషంగా ఉండాలని శ్రీవారిని వేడుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి కృషి


మంత్రి సబితారెడ్డిని కలిసిన అమీర్‌పేట్ ముస్లింలు

మంత్రి సబితారెడ్డి

మహేశ్వరం: మైనార్టీల సంక్షేమం, అభివృద్ధి కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని మంత్రి సబితారెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని అమీర్‌పేట్ గ్రామానికి చెందిన ముస్లింలు గ్రామంలో పీర్ల కోటం, గుమ్మటం ఆశిర్ఖానా హవేలీలను నిర్మించాలని మంత్రికి వినతిపత్రం అందజేశారు. నిర్మాణానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ముస్లింలకు మసీదులు, దర్గాలు, ఈద్గాల నిర్మాణానికి తమవంతు కృషి చేస్తున్నామన్నారు. రంజాన్ సందర్భంగా ముస్లిం సోదరులకు తోఫా కానుకలను అందించి గౌరవించిందన్నారు. కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి సంబంధించిన నిధుల మంజూరుకు తనవంతుగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఎంఏ. సమీర్, మండల పీర్ల పండుగ కమిటీ అధ్యక్షుడు మహ్మద్ జలాలుద్దీన్, హాజీబాబా, అమీరుద్దీన్, సల్లావుద్దీన్, అరీఫ్, యూసుఫ్, మహ్మద్ ఇమ్రాన్, వాజీద్, అక్రమ్, బిలాల్ పలువురు పాల్గొన్నారు.

ఘనంగా ఫలహారం బండి ఊరేగింపు


ఫలహారం బండి ఊరేగింపులో పాల్గొన్న కాలనీవాసులు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని దేవేందర్‌నగర్ కాలనీలోని బెస్ట్ ఫ్రెండ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా ఫలహారం బండి ఊరేగింపు నిర్వహించారు. డప్పు చప్పులు, శివసత్తుల శిగాలు, పోతురాజుల విన్యాసాలు, యువకుల నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా రావిర్యాల మాజీ ఉప సర్పంచ్ జైపాల్‌రెడ్డి, కార్పొరేటర్ కొండల్ యాదవ్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



జోనల్ కమిషనర్‌కు సమస్యలు వివరిస్తున్న శ్రీవాణి

హుడాకాంప్లెక్స్: డివిజన్‌లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎల్‌బీనగర్ ఈస్ట్‌జోనల్ కమిషనర్ పంకజకు మంగళవారం సరూర్‌నగర్ కార్పొరేటర్ శ్రీవాణి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్‌లో మంజూరైన అభివృద్ధి పనులను పూర్తి చేయడంతో పాటు స్థానిక సమస్యలను పరిష్కరించేలా అధికారులను ఆదేశించాలని కోరారు. అదే విధంగా సాయికృష్ణానగర్, పోచమ్మబాగ్, శంకర్‌నగర్, భగత్‌సింగ్‌నగర్, అంబేద్కర్‌నగర్, క్రాంతినగర్, డాక్టర్స్ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, విజయపురి కాలనీ, లక్ష్మీనగర్ కాలనీల్లో రోడ్డు పనులు పూర్తి చేయాలని కోరారు. అలాగే భగత్‌సింగ్ నగర్ అంబేడ్కర్‌నగర్, క్రాంతినగర్, డాక్టర్స్ కాలనీలోని మహిళా భవన్, కమ్యూనిటీ హాల్, అంగన్‌వాడీ భవన మరమ్మతు పనులు పూర్తి చేయాలన్నారు. అంతేకాకుండా శంకర్‌నగర్ మహిళా భవన్, లక్ష్మీనగర్ కమ్యూనిటీహాల్, డాక్టర్స్‌కాలనీ సౌత్ ఫుట్‌పాత్ నిర్మాణం పనులు, నాలా మరమ్మతులు, జేబీకాలనీ నాలా పొడిగింపు, సీఆర్ఎంపీ ఫేస్–2లో భాగంగా శ్రీనివాస కాలనీలో అంతర్గత రోడ్ల మరమ్మతులు, విజయపురి కాలనీ నాలా పనులు పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.

మంత్రి సమక్షంలో జన్మదిన వేడుకలు


నారాయణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంత్రి సబితారెడ్డి

మహేశ్వరం: రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ పి.నారాయణ జన్మదిన వేడుకలు మంగళవారం మంత్రి సబితారెడ్డి నివాసంలో ఘనంగా నిర్వహించారు. నారాయణకు మంత్రి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కార్మిక, ఉద్యోగ, పేద ప్రజల అభివృద్ధి కోసం నారాయణ ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. ఆయన మరింతగా ప్రజలకు సేవ చేయాలని, ఉన్నతస్థాయికి ఎదగాలని మంత్రి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నారాయణకు గజమాల వేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు సురేశ్, యాదగిరి, సమీర్, ప్రబాకర్, రాముడు యాదవ్, చందు, వెంకటేశ్వర్లు పలువురు పాల్గొన్నారు.

రాజకీయాలపై ఆసక్తిని పెంచుకోవాలి


విద్యార్థి నాయకులతో ముఖ్య అతిథులు

హయత్‌నగర్: పాఠ్యాంశాలపైనే కాకుండా సామాజిక రాజకీయ అంశాలపై కూడా విద్యార్థులు ఆసక్తిని పెంచుకోవాలని, విద్యార్థుల నుంచే భావి నాయకులు ఉద్భవిస్తారని హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం హయత్‌నగర్‌లోని రవీంద్ర భారతి పాఠశాలలో జరిగిన విద్యార్థి నాయకుల ఎన్నికలకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ... కొత్త తరం యువత రాజకీయాలపై దృష్టి పెట్టాలని, కేవలం ఉద్యోగాలు సంపాదించే చదువులే కాకుండా మంచి నాయకులుగా విద్యార్థులు ఎదగాలని అన్నారు. విద్యార్థి నాయకులుగా ఎన్నికైన విద్యార్థులకు ఆయన బ్యాడ్జీలు బహూకరించారు. ఎస్ సూర్య పాఠశాల డీన్ పి.శ్రీదేవి, డీఐ రాజేష్, పాల్గొన్నారు.

వనస్థలిపురం: వనస్థలిపురంలోని రవీంద్ర భారతి పాఠశాలలో నిర్వహించిన విద్యార్థి నాయకుల ఎన్నిక (ఇన్వెస్టిట్యూర్ సెర్మనీ)లకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎస్ఐ పరమేష్‌తో కలసి ఆయన విద్యార్థులకు బ్యాడ్జీలు అందజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ కిరణ్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

చైతన్యపురి: రవీంద్రభారతి పాఠశాల చైతన్యపురి బ్రాంచిలో నిర్వహించిన ఇన్వెస్టిట్యూర్ కార్యక్రమంలో ఎన్‌సీసీ నావెల్ యూనిట్ అధికారి రామకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రిన్సిపాల్ బ్యూలా తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి


కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ సుజాతానాయక్

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. డివిజన్‌లోని శ్రీరామనగర్ కాలనీలో మంగళవారం ఆమె కాలనీ వాసులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారానికి అన్ని విధాలా చర్యలు తీసుకుంటామన్నారు. కాలనీ ప్రతినిధులు దశరథరామిరెడ్డి, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.